క్లుప్తంగా

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

తాంసి: ఈనెల 22న అయోధ్యలో రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉన్నందున ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ సూచించారు. గురువారం మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి, ధనోర గ్రామాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగయ్య, రాజన్న, గ్రామపెద్దలు అనిల్, గోవర్ధన్, సంతోష్, పోలీస్ సిబ్బంది శివాజీ, రాందాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉదారత చాటారు. తోటి ఉద్యోగి అయిన కార్పెంటర్ రాంజీ పక్షవాతంతో బాధపడుతుండగా.. రూ.52,700 ఆర్థిక సాయం అందజేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను గురువారం పరామర్శించి కుటుంబసభ్యులకు నగదు అందజేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మహేందర్, గోపి, బండ శ్రీను, మల్లయ్య, తిరుపతి, రవి, రాజు, ఫిరోజ్, సంతోష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన గొల్లి వైభవ్ గత సంవత్సరం మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ కంపెనీ తరపున మంజూరైన రూ.10 లక్షల చెక్కును గురువారం కంపెనీ ప్రతినిధులు కుటుంబసభ్యులకు అందజేశారు. కంపెనీ చైర్మన్ నందిగామ శ్రీనివాస్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ బాబు, బాబురావు, వెంకట దాసరి, భిక్షమయ్య, గుండ్ల స్వామి ఉన్నారు.

ప్రారంభమైన రామనామ సంకీర్తన

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని శబరిమాత ఆలయంలో గురువారం రామనామ సంకీర్తన ప్రారంభమైంది. శివానంద భారతి స్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు మంగళహారులతో ఘన స్వాగతం పలికారు. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఐదు రోజుల పాటు శ్రీరామనామ సంకీర్తలను నిర్వహించనున్నారు.

డైరీ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: టీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరం డైరీలను గురువారం మున్సిపల్ కౌన్సిలర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌హెచ్ రావు, పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిదాస్ చారి, రాష్ట్ర కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ టీవీ కొనుగోలుకు విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కం శంకర్ రూ.10 వేలు నగదును మాజీ జెడ్పీటీసీ కొత్త శంకర్ చేతుల మీదుగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యకు అందజేశారు.

ధర్నా విజయవంతం చేయండి

ఎదులాపురం: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనైనా జిల్లాలోని పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గంగారెడ్డి, బుర్రి సట్వాజీ, అర్ధాంగి రమేశ్, షేక్ పాషా, గేడం పోచిరామ్, కండాల గణేశ్, కామ్లే రాందాస్, తారాబాయి, లక్ష్మీబాయి, నర్సింహులు, అశోక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హాజరు కావాలి

సిరికొండ: మండల కేంద్రంలో ఈనెల 23న నిర్వహించే హిందూ సనాతన కార్యక్రమానికి ప్రతిఒక్క హిందువు హాజరు కావాలని శ్రీనారాయణ మహరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో హిందూ సనాతన సంఘం సభ్యులు మండల కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లి బోట్టు పెట్టి కార్యక్రమానికి ఆహ్వానించారు. హిందువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం'

తలమడుగు: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై ధనశ్రీ. ఏఎంవీఐ భిక్షపతి, ఎంపీడీవో రమాకాంత్, హెచ్‌ఎం రామారావు, చంటి, అశోక్ పాల్గొన్నారు.

రూ.6 కోట్లు ప్రజాధనం వృథా

- చుక్కనీరు అందించని మల్టీ విలేజ్ స్కీం
- నిరూపయోగంగా మారిన వైనం
- పట్టింపులేని అధికారులు.. ప్రజాప్రతినిధులు
- వినియోగంలోకి తీసుకొస్తే నాలుగు గ్రామాలకు మేలు..

పథకం పేరు :
మల్టీ లెవల్ విలేజ్ స్కీం

ఖర్చు చేసిన నిధులు :
రూ. 6 కోట్ల 30 లక్షలు

లబ్ధిపొందే గ్రామాలు :
బోథ్, కనుగుట్ట, కుచులాపూర్, కౌఠ

ఇప్పటి వరకు నీరు సరఫరా అయిన
గ్రామాలు : 0


కరత్వాడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన నీటి పథకం ట్యాంకు

బోథ్: ప్రజల ధనమే కదా అని నిర్లక్ష్యం చూపుతున్నారో లేదా.. నాకేందుకు అంటూ వదిలించుకున్నారో గానీ.. రూ.6 కోట్లా 30లక్షల నిధులు వృథా అయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వం పట్టింపులేనితనంతో ప్రజలకు తాగునీరు దూరమైంది. నాలుగు గ్రామాలకు అందించాల్సిన మంచినీటి పథకం నీరుగారిపోయింది. బోథ్ మండలంలోని బోథ్, కనుగుట్ట, కౌఠ(బి), కుచులాపూర్ గ్రామాలకు మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో 2012లో మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు వద్ద ప్రభుత్వ మల్టీ లెవల్ స్కీం కోసం రూ.5కోట్లా 50లక్షల నిధులను కేటాయించింది. మొదట ఈ నిధులు కేటాయింపుతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు 2014లో పూర్తి కావాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల పట్టింపులేనితనంతో పనులు నెమ్మదిగా సాగాయి. అనంతరం ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.6కోట్లా 30 లక్షలకు పెంచారు. నిర్మాణ వ్యయాన్ని పెంచుతూ 2016 వరకు గడువు ఇచ్చారు. అయినా అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యం కొనసాగడంతో పనులు పూర్తి కాలేదు. ఆ నాలుగేళ్లు పనులు నత్తనడకన సాగాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోయింది.

అలా వేశారు.. ఇలా తవ్వేశారు..
గ్రామాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో గ్రామాలకు పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అయితే పైప్‌లైన్‌ను వేసిన రెండు రోజుల్లోనే మిషన్ భగీరథలో భాగంగా పైప్‌లైన్ కోసం జరిపిన తవ్వకాల్లో మల్టీ విలేజ్ లెవల్ స్కీం కోసం వేసిన పైప్‌లైన్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో వాటిని అధికారులు గానీ, కాంట్రాక్టరు గానీ పట్టించుకోలేదు. దీంతో పైప్‌లైన్ పనులు అలాగే ఆగిపోయాయి. మిషన్ భగీరథ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మధ్య సమన్వయ లోపంతో ప్రజల ధనం మట్టిపాలైంది.

చుక్క నీరు అందలేదు..
మంచి నీటిని అందించడానికి ప్రవేశపెట్టిన మల్టీ లెవల్ స్కీం పథకం ద్వారా కోట్లు వెచ్చించినా లాభం లేకుండా పోయింది. గ్రామాలకు చుక్క నీరు అందించకుండానే పూర్తిగా నిర్వీర్యమైంది. దీంతో గ్రామాలకు వేసిన పైప్‌లైన్‌లో నీటి జాడ కానరాలేదు. నిర్మించిన ట్యాంకు, పంప్ హౌస్ ఉత్సవ విగ్రహంగా మారాయి. ప్రస్తుతం నీటి ట్యాంకు వద్ద మిషన్‌లు, పలు సామగ్రిని ఎత్తుకెళ్లారు.

మిషన్ భగీరథకు అనుసంధానికి ప్రణాళికలేవీ...?
మల్టీలెవల్ స్కీం ద్వారా గ్రామాలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకాలను ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో విలీనం చేయాలని భావించినా... అధికారులు పట్టించుకోకపోవడంతో పథకం అలానే ఉండిపోయింది. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన ఈ పథకాన్ని భగీరథలో విలీనం చేయడం ద్వారా వేల లీటర్ల నీటి సామర్థ్యంతో పాటు నీటిని పంప్ చేసే అవకాశం ఉంటుంది. దీంతో గ్రామాలకు మంచినీరును తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

ప్రజల డబ్బు వృథా చేశారు



మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన మల్టీ విలేజ్ లెవల్ స్కీంను అధికారుల నిర్లక్ష్యంతో ఆగిపోయింది. కోట్లు ఖర్చు చేసినా గ్రామాలకు నీరందించలేకపోయారు. బోథ్‌తో పాటు, కనుగుట్ట, కౌఠ, కుచులాపూర్ గ్రామాలకు నీరు అందించేందుకు చేపట్టిన ఈ పథకం పనికిరాకుండా పోయింది. ప్రభుత్వ అధికారులు వెంటనే గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఓస సాయి కుమార్, బోథ్

పార్కింగ్‌కు అడ్డాగా..




ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వీఐపీ జోన్ ప్రాంతమైన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఆవరణ ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు బసచేసే అతిథిగృహ ఆవరణ అధికారుల నిర్లక్ష్యంతో పార్కింగ్ స్థలంగా మారింది. అయినా సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆదిలాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా గురువారం ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేను న్యాయవాదులు, అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్రాల నగేశ్, చంద్రకాంత్, ఠాకూర్ చందుసింగ్, సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం
ఆదిలాబాద్: కార్యకర్తలకు బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఈనెల 22న ప్రతిఒక్కరూ ఇంటిలో దీపాలు వెలిగించి, దీపావళి జరుపుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

తుడుందెబ్బ కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండల తుడుందెబ్బ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగాల పోచన్న, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా గోడం భుజంగరావు, ఉపాధ్యక్షుడిగా మెస్త్రం విలాస్, రమేశ్, పెందూరు మాధవ్, ప్రధాన కార్యదర్శిగా గోడం ఈశ్వర్, కోశాధికారిగా నీలగిరి అశోక్, కార్యదర్శులుగా దేవర పోచన్న, మాడవి కాంతారావు, నరేంద్ర, సంస్కృతిక కార్యదర్శిగా కనక సురేందర్, ప్రచార కార్యదర్శులుగా మెస్త్రం శంభు, చాకటి సురేశ్, సలహాదారులుగా దంతే రమేశ్, మాడవి దేవురావు, జైతు పటేల్, మహాదేవ్, మెస్త్రం నాగోరావు, శ్రీనివాస్ పటేల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కోగవ నగేశ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, కుంర జ్ఞానేశ్వర్, ఆత్రం గణపతి, మాడవి దిగంబర్, మాధవరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన తుడుందెబ్బ సభ్యులు

మాల సంక్షేమ సంఘం..
తలమడుగు మండలంలోని లింగి గ్రామంలో గురువారం మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అయిండ్ల చిన్న పోచన్న, అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా దయాకర్, ప్రధాన కార్యదర్శిగా అన్వేష్, వెంకటేష్, కోశాధికారిగా ప్రదీప్‌లను ఎన్నుకున్నారు, కార్యక్రమంలో మండల హడ కమిటీ సభ్యులు మగ్గిడి ప్రకాష్, క్రాంతి కుమార్, రమేశ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

రేపు జైజంగు.. జైలింగు దీక్షలు

నేరడిగొండ: శ్రీగోపాలకృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో ఈనెల 20న యాపల్‌గూడ గ్రామంలో జైజంగు.. జైలింగు దీక్షలు చేపట్టనున్నట్లు గ్రామపెద్దలు మండాడి భీంరావు పటేల్, సిడాం మనోహర్, పెందూర్ శంభు, సిడాం లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం హనుమాన్ మందిరం వద్ద నిర్వహించడం జరుగుతుందన్నారు. 21 రోజుల పాటు దీక్షలు ఉంటాయని, ఆసక్తిగల వారు దీక్షలు స్వీకరించాలని సూచించారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ గ్రామానికి చెందిన జక్కుల స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుకి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, ప్రశాంత్ రెడ్డి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులు చేసుకోవాలి

నార్నూర్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జాడి రాజలింగు గురువారం తెలిపారు. ఓటరు జాబితా, సంబంధిత ఫారములతో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరుగా నమోదు కాని వారు, ఓటరు జాబితాలో పేరు, చిరునామా సవరణల గురించి, పోలింగ్ కేంద్రాల మార్పిడి, అభ్యంతరంపై దరఖాస్తులు స్వీకరించబడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

నేరడిగొండ: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని కేఎన్‌ఆర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రమాదాల నివారణ చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్వీ కన్సల్టెన్సీ టీం లీడర్ ప్రసన్న కుమార్, సురేంద్ర బాబు, ఆలం నసీమ్, ప్రాజెక్టు ఇన్‌చార్జి రామ్‌మోహన్ రెడ్డి, పూసపత్రి వినేష్, పెట్రోలింగ్, అంబులెన్సు సిబ్బంది పాల్గొన్నారు.

'జోగు రామన్నను విమర్శించడం సరికాదు'

ఆదిలాబాద్‌రూరల్: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నపై విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నాయకులు జోగు రామన్నపై ఆరోపణలు చేస్తే ఖండించిన భోజారెడ్డి విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరె రాజన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం రూ. కోటిన్నర జోగు రామన్నకు ఇచ్చారని అడ్డి భోజారెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అడ్డి భోజారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న సమయంలో అనుభావించిన పదవుల కోసం జోగు రామన్నకు ఎన్నికోట్లు ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డబ్బుల పంపకాల్లో జోగు రామన్న తనయులు గొడవపడ్డారని చెప్పడం తగదన్నారు. డీసీసీబీ చైర్మన్ పదవి విషయంలో అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలను ఒప్పించి సీల్డ్ కవర్‌లో పదవిని ఇప్పించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో విలువలతో కూడిన రాజకీయలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. సమావేశంలో పార్టీ కౌన్సిలర్‌లు అశోక్ స్వామి, సందా నర్సింగ్, వెంకన్న, ప్రకాష్, నాయకులు రాంకుమార్, కొండ గణేష్, విషు, శ్రీనివాస్, లస్మన్న, ఆహబీద్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

జయంతి విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని కాన్షే ఫంక్షన్ హాల్‌లో మాంగ్ సమాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే ముక్తా స్వాతే మాంగ్ జయంతిని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గాదెకర్ పరుశురామ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాంగ్ సమాజ్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. మాంగ్ సమాజ్ పెద్దలు, మేధావులు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాంగ్ సంఘం మండల అధ్యక్షుడు వాగ్మరే అంకుష్, ప్రధాన కార్యదర్శి సమూకరావ్ హరిదాస్, మండల కోశాధికారి కాంబ్లే జ్ఞానేశ్వర్, సలహాదారులు సమూకరావ్ దీపక్, కాంబ్లే సాయిరాం, కాంబ్లే సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాంగ్ సంఘం నాయకులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్‌కు యువజన కాంగ్రెస్ ఫిర్యాదు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం న్యూ హౌజింగ్ బోర్డ్ పరిధిలోని సర్వే నంబర్ 161/ఏలో మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ మడిగెల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా సదరు వ్యక్తి ఇష్టరాజ్యాంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పనులు ఆపాలని మున్సిపల్ అధికారులు ఆదేశించిన లెక్క చేయడం లేదన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైన దృష్టి సారించి ఆక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి కబ్జా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ప్రెసిడెంట్ అర్బాత్, ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ రాహూల్, కాంగ్రెస్ మావల మండల అధ్యక్షుడు శేఖర్, భూమేష్, ఫైయిమ్, సురేశ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా మహాదేవ్ ఆలయ జాతర


సాలెవాడ గ్రామంలోని మహాదేవ్ ఆలయం


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న రితీశ్‌రాథోడ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలోని హరహర మహాదేవ్ ఆలయ జాతర గురువారం ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆలయం వద్ద పూజలు చేశారు. జాతరలో భాగంగా బీజేపీ నాయకులు రితేశ్ రాథోడ్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కుస్తీ, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు తరలివచ్చి పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నందకుమార్, ఎంపీటీసీ రవీందర్, నిర్వాహకులు రాందాస్, అందుసింగ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాదిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గాదిగూడ మండలంలోని సెడ్వాయి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. చలి తీవ్రత అధికంగా ఉన్నందున రాత్రి వేళలో బయటకు వెళ్లొద్దన్నారు. సాధ్యమైనంత వరకు వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో హెచ్‌ఈవో పవర్ రవీందర్, ప్రతిమ, ఎల్‌టీ గంగాదేవి, సిబ్బంది ఉమామహేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని టక్కుగూడ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న నీటి, రోడ్డు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందన్నారు. ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేవిధంగా చూస్తానన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన కల్వర్టు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో ఐటీడీఏ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కల్వర్టు స్థలం కబ్జాకు గురైంది. కల్వర్టును సగానికి పైగా కబ్జా చేసి గుట్టు చప్పుడు కాకుండా భవనం నిర్మాణం చేపట్టారు. ఇటీవల కాలంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా కల్వర్టు స్థలం అక్రమణ బయట పడింది. మండల కేంద్రంలో రెండు కిలో మీటర్ల రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. పాత కల్వర్టులను కూల్చివేసి నూతన కల్వర్టులు నిర్మిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు మధ్యలోనే భవనం నిర్మించారు. భవిష్యత్ వరద నీరు పోకుండా రోడ్డుపై నిలిచిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి అక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇచ్చోడ ప్రధాన రోడ్డులో కబ్జాకు గురైన కల్వర్టు

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

సిరికొండ: మండల కేంద్రంలోని పాఠశాలల వద్ద మండల కేంద్రానికి చెందిన సిరికొండ యువసేన సభ్యులు గురువారం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జెడ్పీ, ఉన్నత పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాదారులు అతివేగంగా ప్రయాణిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం అభినందనీయం ఏఎస్సై రమేశ్, సిరికొండ మాజీ సర్పంచ్ పెంటన్న అన్నారు. కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, శాగంటి సాయికృష్ణ, రుద్రారపు మల్లేష్, ప్రవీణ్, దత్తు, రవి, మహేష్ పాల్గొన్నారు.


స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న సభ్యులు